## క్లుప్తంగా

### ఇంద్రపాలెం నేరేళ్లమ్మ జాతర

**కాకినాడ రూరల్:** మండలంలోని ఇంద్రపాలెం గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరను గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా శుక్రవారం అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

### చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగను పంపిణీ చేస్తున్న సానా నాగేశ్వరరావు, ప్రవీణ

**కాకినాడ రూరల్:** ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు సానా నాగేశ్వరరావు, సానా ప్రవీణ గురువారం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడాలి




సమావేశంలో పాల్గొన్న సాహితీవేత్తలు కృష్ణబాబు, చంద్రశేఖర్ తదితరులు

**కాకినాడ కల్చరల్:** తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని శాస్త్రి కళా ప్రాంగణం సమావేశపు మందిరంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 'పద్యరస నైవేద్యం' పేరుతో పద్యపఠనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పద్య పఠనం శిక్షకులు పి.నాగరాజు, తోట గణపతి పద్యం రాగయుక్తంగా ఎలా ఆలపించాలో వివరించారు. సాహితీవేత్త మార్ని జానకిరామ్ చౌదరి, పీఎస్ఎస్ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం పంచాయతీల ఎంపిక



పెద్దాపురప్పాడులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కరప:** స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పురస్కారం కోసం ఉత్తమ పంచాయతీలను గుర్తిస్తున్నట్టు ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎంపికకు తనతోపాటు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, మరో ముగ్గురు సభ్యులతో మండల పరిధిలో రోజుకు నాలుగైదు పంచాయతీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, గొర్రిపూడి తదితర గ్రామాల్లో తనిఖీలు చేసినట్టు ఆయన తెలిపారు. నిర్దేశించిన ప్రమాణాలలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర అంశాలన్నీ సక్రమంగా జరుగుతున్నాయోలేదో పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయా పంచాయతీల పనితీరుపై నివేదిక రూపొందిస్తున్నట్టు తెలిపారు.

### తాగునీటి ట్యాంకులు శుభ్రం



నడకుదురులో బ్లీచింగ్‌తో ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్మికుడు

**కరప:** మండల పరిధిలో ఎంపీడీఓ కర్రె స్వప్న ఆదేశాల మేరకు గురువారం పలు గ్రామాల్లోని రక్షిత నీటి ట్యాంకులు శుభ్రం చేశారు. నడకుదురు, గొర్రిపూడి, కరప, జి.భావారం, వేళంగి, యండమూరు తదితర గ్రామాల్లో శానిటేషన్ పనులు నిర్వహించి, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, వాల్వ్ పిట్‌ల వద్ద శుభ్రంచేసి, డ్రైడే పాటించారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆయా గ్రామ సర్పంచ్, గ్రామకార్యదర్శులతో కలసి ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించి, శుక్రవారం కూడా డ్రైడే పాటించి, నీరు నిల్వలేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓ పీఆర్డీ సూచించారు. పంచాయతీ బావుల వద్ద, వీధి కుళాయిల వద్ద క్లీనింగ్ చేయించాలని, పైపు లైన్లు, కుళాయిల లీకులకు మరమ్మతు చేయించాలన్నారు.

# మనసులు మురిసేలా

- తెరుచుకున్న బీచ్ ఫ్రంట్
- ఎట్టకేలకు సందర్శకులకు అనుమతి
- చురుగ్గా అభివృద్ధి పనులు
- కోవిడ్‌తో మూతపడిన బీచ్ పార్కు
- పర్యాటక శాఖ, లీజుదారుడి మధ్య సయోధ్యతో త్వరలో ప్రారంభం




బీచ్ ఫ్రంట్ ఆవరణలో ప్రస్తుత పరిస్థితి ఇదీ..

**కాకినాడ రూరల్:** కనుచూపు మేర నీలి సంద్రం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. కెరటాల సవ్వడి నడుమ కాసేపు జలకాలు.. ఇలా కాలక్షేపం చేసేందుకు కాకినాడ వచ్చే పర్యాటకులకు మండలంలోని సూర్యారావుపేట బీచ్ ఆహ్వానం పలుకుతోంది. ఇక్కడి లైట్ హౌస్ సమీపంలో సందర్శకులను కట్టిపడేసే అందాలతో ఏర్పాటు చేసిన బీచ్ ఫ్రంట్ (కాకినాడ బీచ్ పార్కు) తెరుచుకుంది. దాదాపు రెండున్నర ఏళ్లుగా మూతపడిన ఈ పార్కును కేంద్ర ప్రభుత్వం రూ.46 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో అభివృద్ధి చేశారు. దీంతో పాటు నాలుగు వరసల రోడ్డు, ఫుట్‌పాత్, ఉప్పుటేరుపై వంతెన నిర్మించారు.

మొదట బీచ్‌కు ముందు సందర్శకులను ఆకట్టుకునేలా బీచ్ ఫ్రంట్ పేరిట రెస్టారెంట్, రూమ్‌లు, కన్వెన్షన్ హాల్, పార్కులు, మ్యూజికల్ ఫౌంటెన్, లేజర్ షో తదితర హంగులు సమకూర్చారు. ఇవన్నీ ఏడాది పాటు నడిచినా, తదనంతర కాలంలో లేజర్ షో పరికరాలు మాయం కావడం, లీజు దారుడికి, ఏపీ టూరిజం శాఖకు మధ్య వివాదం తలెత్తి కోర్టుకు ఎక్కడంతో ఈ పార్కు మూతపడింది.

ఈలోగా కోట్ల రూపాయాలతో ఏర్పాటు చేసిన పార్కులు దెబ్బతినగా, లాన్ పచ్చదనం కనుమరుగయ్యాయి. కోవిడ్ తరువాత తెరుస్తారని సందర్శకులు భావించినా నిరాసే మిగిలింది.

**ఎమ్మెల్యే కన్నబాబు కృషి.. రాష్ట్ర ప్రభుత్వం స్పందనతో..**

నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకమైన సూర్యారావుపేట బీచ్‌కు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బీచ్ ఫ్రంట్‌ను తెరిపించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కృషి ఎనలేనిది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించి బీచ్ ఫ్రంట్‌ను తెరిచేందుకు కృషి చేశారు. లీజు దారుడితో జరిపిన చర్చలు ఫలప్రదమై, లీజు బకాయిలు చెల్లించడంతో చురుగ్గా మరమ్మతులు నడిచాయి. బీచ్ ఫ్రంట్‌లో సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పనులు చేపడుతున్నారు. పర్యాటక శాఖ తమకు బీచ్ ఫ్రంట్ నిర్వహణ బాధ్యత తిరిగి అప్పగించడంతో తెరిచామని, పనులు చేపడుతున్నట్టు లీజుదారుడి వద్ద స్థానికంగా మేనేజరుగా పని చేస్తున్న భరత్ తెలిపారు.

**పర్యాటక శాఖ ఎండీ కృషి**

ఏపీ పర్యాటక శాఖ ఎండీ కె.కన్నబాబు బీచ్ ఫ్రంట్ తెరిపిచేందుకు కృషి చేశారు. తమ ప్రాంతానికి తలమానికమైన సూర్యారావుపేట బీచ్‌లోని బీచ్ ఫ్రంట్‌ను తెరిపించాలని ఆయన ప్రత్యేక చొరవ తీసుకోవడంతో కోర్టు వ్యవహారం పరిష్కారమయ్యిందని పర్యాటక శాఖ అధికారులు, లీజుదారులు పేర్కొంటున్నారు.




బీచ్ పార్కు ప్రవేశ ద్వారం



ఉప్పుటేరుపై ముచ్చటగొలుపుతున్న గ్లాస్ బ్రిడ్జి

**లీజు దారుడికి తాళాలు అప్పగించాం**

కాకినాడ సూర్యారావుపేట బీచ్ ఫ్రంట్ తాళాలను ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) ఆపరేటరు వాసుబాబుకు తాళాలు అప్పగించాం. హెడ్ ఆఫీసు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వారు పనులు చేపడుతున్నారు.

– పవన్, ఏపీ టీడీసీ మేనేజరు, కాకినాడ డివిజన్

### పేదల ఇళ్ల స్థలాలను శ్మశానాలనడం హేయం



జమ్మలమడక నాగమణి

**కాకినాడ రూరల్:** పేదల సొంతింటి కల నెరవేర్చే సంకల్పంతో సీఎం జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు శ్మశానాలతో పోల్చడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజినల్ కన్వీనర్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి అన్నారు. కాకినాడ 49వ డివిజన్ కొత్త గైగోలుపాడు నివాసలంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ జగనన్న కాలనీలతో కొత్త గ్రామాలు పుట్టుకొస్తున్నాయని, అలాంటి పథకాన్ని శ్మశానంతో పోల్చడం లోకేష్ అజ్ఞానాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు ఇస్తున్న ఇళ్లతో ఈ ప్రభుత్వంపై పేదల్లో విశ్వాసం పెరుగుతోందని ఆమె అన్నారు.

### వ్యక్తికి ఐదు రోజుల జైలు, జరిమానా

**కాకినాడ లీగల్:** మద్యం తాగి బైక్ నడుపుతున్న వ్యక్తికి ఐదు రోజుల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరుపా భాంజ్ డియో గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ బర్మాకాలనీకి చెందిన మేరుకొండ కృప మహేశ్ మద్యం తాగి మోటార్ బైక్‌పై వెళుతున్నాడు. తిమ్మాపురం వై జంక్షన్ వద్ద ఈ నెల 16న పోలీసులు అతడిని పట్టుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో అతనిపై నేరం రుజువు కావడంతో ఐదు రోజుల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- జగన్నాథపురంలో గడప గడపకూ..



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

**కాకినాడ:** కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 20బి సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పలువురు అధికారులు, నాయకులతో పాటు ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలోకి తొక్కిన టీడీపీ, జనసేన వంటి పార్టీలు తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజల్లోకి వస్తాయని, అలాంటి పార్టీలను నమ్మవద్దని కోరారు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు కొపనాతి సత్యనారాయణ, వెలమల మల్లేశ్వరరావు, చిక్కాల సుధాకర్, నరసింహమూర్తి, జగడం శ్రీనివాస్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ఉద్యోగ, పెన్షనర్లను ఆదుకుంటాం**

**కాకినాడ సిటీ:** ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మూడో దశ కార్యాచరణలో భాగంగా 'ఉద్యోగుల ఆవేదన చెబుదాం' అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. న్యాయమైన కోరికల సాధనకు ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే ద్వారంపూడి స్పందిస్తూ ఉద్యోగుల సామాన్యమైన కోర్కెలు త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తారన్నారు. అందుకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు, జనరల్ సెక్రటరీ ఎస్‌వీఎస్ ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్, నాయకులు పి.పుల్లయ్య, పి.దుర్గాప్రసాద్, రవి, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

### సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది

- వైఎస్సార్ మత్స్యకార భరోసాపై కృతజ్ఞతలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకారులు, మాజీ కార్పొరేటర్ మణికుమార్

**కాకినాడ రూరల్:** కాకినాడ మూడో డివిజన్‌కు చెందిన మత్స్యకారులు గురువారం సాయంత్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సముద్రంలో చేపలవేట నిషేధం అమలులో ఉండడంతో వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద గొడారిగుంట, శాంతనపురికాలనీ తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు 260 మందికి రూ.10 వేల చొప్పున వేటనిషేధ భృతి లభించడంతో వారంతా ఉత్సాహంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. చొడుపల్లి జగన్నాథం, అంగడి రాజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, ఎన్.నేరెళ్ల ముఖ్య అతిథులుగా పాల్గొని మత్స్యకారులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటారన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కరప:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు చేస్తున్నందువల్ల కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరప విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగం పెరిగినందున కెపాసిటర్ మార్పు, ఇతర మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఏఈ సానా ఈశ్వరప్రసాద్, సబ్ ఇంజినీర్ టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### సేవా మార్గాన్ని అలవరచుకోవాలి



కలెక్టరేట్‌లో మజ్జిగను అందజేస్తున్న బార్ అసోసియేషన్ లేడీ రిప్రజెంటేటివ్ సునీత

**కాకినాడ సిటీ:** ప్రతి ఒక్కరూ సేవా మార్గాన్ని అలవరచుకోవాలని కాకినాడ బార్ అసోసియేషన్ లేడీ రిప్రజెంటేటివ్ జి.సునీత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆమె మజ్జిగను అందజేసారు. కరోనా సమయంలో మరణించిన 10 మంది జర్నలిస్టుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని నిరాటంకంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన కక్షిదారులకు, బాటసారులు, వాహనచోదకులు, ఆటోవాలాలకు మజ్జిగను అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యురాలు ఉద్దండ ఉమాగౌరి, జీవీ రావు, సీనియర్ న్యాయవాది కేవీవీ చలపతి, అసోసియేషన్ అధ్యక్షుడు మంగం శివరామకృష్ణ తదితరులు పాల్గొని కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను అభినందించారు.

# సెల్లార్లను పార్కింగ్‌కు వినియోగించండి

- ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి
- ఇప్పటికే 64 కాంప్లెక్స్‌ల గుర్తింపు
- ప్లాన్‌లో అనుమతి పొంది వ్యాపారాలు చేయడంపై కమిషనర్ హెచ్చరిక



సమీక్షలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

**కాకినాడ సిటీ:** మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన కాకినాడ టూ టౌన్ నుంచి జగన్నాథపురం బ్రిడ్జి వరకు భవన యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వ్యాపార యజమానులు సెల్లార్‌లో పార్కింగ్ నిమిత్తం ప్లాన్ అనుమతి పొంది, పార్కింగ్‌కు వినియోగించకుండా వ్యాపారాలు చేసే 64 షాపింగ్ కాంప్లెక్స్‌లను గుర్తించినట్లు తెలిపారు. వారం రోజుల్లో సెల్లార్‌లో పార్కింగ్ నిమిత్తం ప్లానులో అనుమతి పొంది పార్కింగ్ ఏర్పాటు చేసుకోవడానికి కార్యాచరణ ప్రణాళికతో ఈ నెల 25న మళ్లీ సమావేశం నిర్వహిస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు తప్పక హాజరు కావాలన్నారు. కాకినాడ మెయిన్ రోడ్డులో వాహనదారులు వారి వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతంలో కాకుండా ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేస్తున్నారన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు సెల్లార్‌లో పార్కింగ్ ఏర్పాటు చేస్తే కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని కమిషనర్ వివరించారు. నగరపాలక సంస్థ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సూపర్‌వైజర్లు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వివిధ షాపింగ్ యజమానులు పాల్గొన్నారు.

**రంగరాయలో నేడు 'వలంటీర్లకు వందనం'**

వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వలంటీర్లను పురస్కారాలతో సన్మానించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆయన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వలంటీర్ల పని తీరుకు సంబంధించి పలు అంశాలను పరిగణలోకి తీసుకుని వారికి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ నాగనరసింహారావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, పర్యవేక్షక ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, కార్యదర్శి ఏసుబాబు, మేనేజర్ సత్యనారాయణ, మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

**కాకినాడ సిటీ:** వీధి కుక్కల గుర్తింపుపై పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి సర్వే చేసేందుకు వీలుగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నట్లు అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. గురువారం వీధి కుక్కల సర్వేపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో 14 సర్కిళ్లలో 10 సర్వే బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే చేసేందుకు జోన్-1 నుంచి 7 సర్కిళ్లు, జోన్-2 నుంచి 7 సర్కిళ్లుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు, 4 గంటల నుంచి 5 గంటల వరకు రెండు పశుసంవర్ధక శాఖ అధికారులు వచ్చి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి సచివాలయం నుంచి నలుగురు వలంటీర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకు మున్సిపల్ సిబ్బంది, పశుసంవర్ధక సిబ్బంది నగరపాలక సంస్థ పరిధిలో ఎన్ని వీధి కుక్కలు ఉన్నాయో గుర్తించి, సర్వే నివేదికను అనుసరించి యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు నిర్వహించేందుకు వ్యాక్సిన్ వేస్తారని ఏడీసీ తెలిపారు.

# ట్రాక్ ఎక్కిన జీవన రైలు

- రైల్వేలో ఉద్యోగం సాధించిన వలంటీర్
- అభినందించిన గ్రామస్తులు



చక్రవర్తిని సత్కరిస్తున్న పుర ప్రముఖులు, అధికారులు

**పిఠాపురం:** ఆ యువకుడిది నిరుపేద కుటుంబం. తండ్రి రెక్కలు ముక్కలు చేసుకుంటూ తెచ్చే కూలి డబ్బులతో కుటుంబం గడవడమే కష్టంగా ఉండేది. అయినప్పటికీ బిడ్డల్ని కష్టపడి చదివించాడు. బంగారు భవిష్యత్తు లభిస్తుందనే కోటి ఆశలతో ఆ యువకుడు ఉన్నత విద్య అభ్యసించాడు. అయితే చదువు పూర్తి కాగానే అతడికి ఉద్యోగం లభించలేదు. దీంతో, తండ్రికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ వలంటీర్‌గా సేవలందించడం ఆరంభించాడు. నిస్వార్థంగా అందించిన ఆ సేవల ఫలితమో ఏమో కానీ.. ఆ యువకుడు ఏకంగా రైల్వేలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

యు.కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన ఈ యువకుడి పేరు గాది చక్రవర్తి. పేరుకే చక్రవర్తి కానీ.. అతడిది రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబం. తల్లిదండ్రులకు ముగ్గురు మగ బిడ్డలు. వారిలో రెండో వాడు చక్రవర్తి. తండ్రి కూలి పని చేసుకుంటూనే పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలనే ఉద్దేశంతో బాగా చదివించాడు. తండ్రి ఆశల్ని చక్రవర్తి గుర్తించాడు. కష్టపడి బీటెక్ చదివాడు. అనంతరం మంచి ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం లేకపోయింది. తండ్రి తెస్తున్న కూలి డబ్బులతో కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో ఏదో ఒకటి చేసి నాన్నకు చేదోడుగా నిలవాలని చక్రవర్తి నిర్ణయించుకున్నాడు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాలేదు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలనుకున్నా కుటుంబ పరిస్థితి సహకరించేది కాదు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించినప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇది చక్రవర్తికి కొండంత ధైర్యాన్నిచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గ్రామ/వార్డు సచివాలయాలతో పాటు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. దీనిని చక్రవర్తి చక్కగా వినియోగించుకున్నాడు. ఎటువంటి పరీక్షా రాయకుండానే ఒక్క దరఖాస్తు, ఇంటర్వ్యూతో వలంటీర్‌గా ఎంపికయ్యాడు. వలంటీర్‌గా అతడికి వచ్చే భృతి ఆ కుటుంబానికి మరి కొంత ఆసరానిచ్చింది.

వలంటీర్‌గా సేవలందిస్తూనే చక్రవర్తి మరో పక్క పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యాడు. మొత్తమ్మీద అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. రైల్వేలో ట్రాక్‌మన్‌గా ఎంపికయ్యాడు. తద్వారా తన జీవిత రైలు పట్టాలెక్కిందని చక్రవర్తి సంబరపడుతున్నాడు. తాను ఉద్యోగం సాధించేందుకు అవసరమైన ధీమాను, చేయూతను వలంటీర్ పోస్టు ఇచ్చిందని ఆనందంగా చెబుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌కు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని చక్రవర్తి అంటున్నాడు. వలంటీర్‌గా ప్రజలకు సేవలందిస్తూ మంచి ఉద్యోగం సాధించిన చక్రవర్తిని గ్రామస్తులు అభినందించారు.

# ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి

- టెన్త్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి ఆదేశం




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

**పిఠాపురం:** ప్రధానోపాధ్యాయులందరూ వెంటనే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) నాగమణి ఆదేశించారు. పిఠాపురం బాదం మాధవరావు బాలికోన్నత పాఠశాలలో పిఠాపురం విద్యా శాఖ డివిజన్‌లోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాచ్‌మెంట్ ఏరియాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, వలంటీర్లు, విద్యాశాఖ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారంతో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ దీనిని అమలు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. నాడు-నేడు పనులను వచ్చే 12వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు.